క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

ఖమ్మంమయూరిసెంటర్: స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఖమ్మం సర్కిల్ సహాయ కార్మిక అధికారిణి సీహెచ్.వెంగమాంబ తెలిపారు. శనివారం స్థానిక రోటరీ క్లబ్‌లో కార్మిక శాఖ ఆధ్వర్యాన టూ వీలర్ మెకానిక్ ఓనర్స్, వర్కర్స్ అసోసియేషన్ సభ్యులకు లోక్‌సభ ఎన్నికలపై అవగాహన కల్పించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈమేరకు సీవిజిల్, ఓటర్ హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించి యాప్ డౌన్‌లోడ్ చేయించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారి పీవీకే శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని మోమినాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యాన రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఫౌండేషన్ అధ్యక్షుడు వెనిగళ్ల అనిల్‌కుమార్, దొడ్డా సీతారామయ్యలు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగరాజు, రఘు, పూర్వ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

'గీతాంజలి'లో ఎస్సెస్సీ విద్యార్థులకు వీడ్కోలు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని గీతాంజలి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం రాత్రి వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ టీవీ అప్పారావు, డైరెక్టర్లు టి.పద్మ, టి.అరుణ్‌లు జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

నేలకొండపల్లి: వచ్చే నెల 1వ తేదీ నుంచి జరిగే ఎస్ఎఫ్ఐ పాలేరు డివిజన్ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పానుకుల సుధాకర్ పిలుపునిచ్చారు. శనివారం ఈమేరకు జూనియర్, డిగ్రీ కాలేజీలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యారంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బొడ వెంకట్, షేక్ మౌలానా, వినయ్, సన్నీ, రమ్యప్రియా తదితరులు పాల్గొన్నారు.

'రన్ ఫర్ జీసస్' ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

ఖమ్మంగాంధీచౌక్: గుడ్ ఫ్రైడే, ఈస్టర్ వేడుకల సందర్భంగా శనివారం నగరంలో క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కొత్త బస్టాండ్, బస్ డిపో మీదుగా పెవిలియన్ గ్రౌండ్‌కు చేరుకుంది. క్రైస్తవులు పలు నినాదాలతో కూడిన ప్లకార్డులు, జెండాలు, ఫ్లెక్సీలు చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చల్లగుండ్ల రమేష్, తుంపాల కృష్ణమోహన్, పల్లా రాజశేఖర్, ఏర్పుల ప్రభాకర్, మందా సంజీవరావు, తిమోతి, జాన్ కాంతారావు, వేముల సత్యం, జాకో బ్ జాన్, బాలస్వామి, బాబూరావు, అభిషేక్, రవికిరణ్, పాల్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో దండా సీతమ్మ–గోపయ్య మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యాన శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడగా.. గ్రామ పెద్దలు దండా సతీశ్, సత్యనారాయణరెడ్డి, షేక్ సొందుమియా, పి.వీరయ్య, నాగరాజు, దండా నరసింహారావు, యలమద్ది లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

మోదీని గద్దె దించాలి

ఖమ్మంమయూరిసెంటర్: కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నరసింహారావు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన సంఘ ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ల సేవలో భాగంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇటీవల కార్మిక సంస్కరణలను మరింత వేగంగా అమలు చేస్తుందని అభిప్రాయపడ్డారు. దేశంలో ప్రైవేటీకరణ ప్రక్రియను మోదీ ప్రభుత్వం వేగవంతం చేసిందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీకి వ్యతిరేకంగా ప్రచారం చేయాలని కార్మికులకు సూచించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ, సహాయ కార్యదర్శి సీహెచ్. సీతామహాలక్ష్మి, కోశాధికారి షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

కూలర్‌తో.. కూల్ కూల్!

వేసవిలో అందరి దృష్టి కూలర్ల వైపే..

- సామాన్యులకు సైతం అందుబాటు ధరల్లో
- కొత్త డిజైన్లతో మార్కెట్‌లో లభిస్తున్న వైనం
- మోడల్, నాణ్యతను బట్టి ధరలు



దుకాణాల ఎదుట విక్రయానికి సిద్ధంగా ఉంచిన కూలర్లు

ఖమ్మం సహకారనగర్: రోజు రోజుకు ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ వేడి అధికంగా ఉంటుండగా.. ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపటం లేదు. ఇళ్లల్లోని ఫ్యాన్ గాలి సైతం వేడిగా వస్తున్న క్రమంలో అందరి దృష్టి కూలర్ల వైపు పడింది. ఎండ వేడిమి నుంచి రక్షణ పొందేందుకు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్న పరిస్థితులుండగా.. ఇంట్లోనైనా కూల్‌కూల్‌గా ఉండాలని భావిస్తున్నారు. ఏసీల కొనుగోలుపై అయిష్టత ఉన్నవారు కూలర్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో సమ్మర్‌లో ఇంట్లో ఉన్నంతసేపయినా చల్లగా ఉండేందుకు ఇష్టపడుతున్నారు.

ఆకట్టుకునేలా డిజైన్లు..

చాలామంది దుకాణదారులు వినియోగదారులను ఆకట్టుకునేందుకు దుకాణం ఎదుట రకరకాల కూలర్లను అందుబాటులో ఉంచుతున్నారు. గతంలో గడ్డితో తయారు చేసిన కూలర్స్ ఉండగా.. తాజాగా కూలింగ్ ప్యాడ్స్ కలిగిన కూలర్లు, బ్లోయర్‌తో కూడిన కూలర్ తదితర రకాలు లభిస్తున్నాయి. ఇవి సామాన్యులకు సైతం అందుబాటులో ఉంటున్న క్రమంలో అధికంగా కూలర్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

కూలర్ల వైపే మొగ్గు..

వేసవి కాలంలో ఇంట్లో ఉన్న ఫ్యాన్ గాలి వేడిగా ఉంటున్న క్రమంలో అధికంగా కూలర్లను కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతున్నారు. ఏప్రిల్, మేల్లో ఎండలు మరింతగా ఉండే అవకాశం ఉండడంతో పాటు వడగాల్పులు వీస్తుంటాయి. ఈ క్రమంలో వాటి నుంచి రక్షణ పొందేందుకు కూలర్లను కొనడానికి మొగ్గుచూపుతున్నారు.

అందుబాటులో ధరలు..

కూలర్ల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉన్నాయనే చెప్పుకోవచ్చు. ప్రారంభ ధర రూ.2 వేల నుంచి రూ. 20 వేల వరకు ఉన్నాయి. ఇందులో లీటర్లు, కంపెనీల బట్టి ధరలుండగా.. సామాన్యులు రూ.3 వేల నుంచి రూ.10వేల వరకు కొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. వీటిలో లీటర్ల కెపాసిటీ అధికంగా ఉంటే మరింత చల్లదనంగా ఉంటాయనే భావనలో వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు.

ఫీచర్స్ ఆధారంగా ధరలు..



ఎండలు అధికంగా ఉంటున్న క్రమంలో కూలర్లను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు. సామాన్యులకు సైతం ధరలు అందుబాటులో ఉన్నాయి. సైజు, క్వాలిటీని బట్టి మార్కెట్‌లో అందుబాటులో లభిస్తున్నాయి.

– నరేష్, ఎలక్ట్రానిక్స్ విక్రయదారుడు

కూలర్ కొన్నా..



మున్ముందు ఎండలు మరింత ఉంటాయనే భావనతో కూలర్‌ను కొన్నా. ఇంట్లో ఫ్యాన్ గాలి వేడిగా ఉంటున్న క్రమంలో కుటుంబ సౌకర్యార్థం కూలర్ తీసుకున్న. మంచిగా అనిపిస్తుంది. ఈ ఎండాకాలమంతా కూలరే మాకు ఏసీ.

– ఎస్.మౌనిక, వినియోగదారురాలు

ఘనంగా అంకమ్మ గుడి ప్రతిష్ఠ వేడుకలు



పూజలు చేస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ క్లైకొండాయిగూడెం రోడ్‌లో వేంచేసి ఉన్న శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లు, నాగేంద్రస్వామి వారి దేవాలయ పునఃప్రతిష్ఠా మహోత్సవ వేడుకలు శనివారం వేలాది మంది భక్తజన సందోహం నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ వారి బ్రహ్మశ్రీ బాదంపూడి రామలింగేశ్వరశర్మ అర్చక బృందం ఆధ్వర్యాన గణపతి పూజ, పుణ్యాహవాచనము, పంచగవ్య ఆరాధన వంటి పూజలు చేశారు. ఈక్రమంలో 6వ డివిజన్ కార్పొరేటర్ నాగండ్ల కోటి దంపతులు అమ్మవారికి వెండి శటగోపాణి బహూకరించారు. కాగా, ఈ పూజా కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, కార్పొరేటర్లు హుస్సేన్, దండా జ్యోతిరెడ్డి, నాగండ్లకోటి, పల్లెబోయిన భారతి చంద్రం, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి, శీలం శెట్టి వీరభద్రం, ఆకులగాంధీ, ఆకుతోట ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

'ఉపాధి'కి అధిక నిధులు కేటాయించాలి

ఖమ్మంమయూరిసెంటర్: మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టానికి అధిక నిధులు కేటాయించడంతో పాటు ఏడాదికి రూ.2.50 లక్షల కోట్లతో 200 రోజుల పనిదినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయొద్దని, వ్యవసాయ కూలీల కోసం పకడ్బందీగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రతి కూలీకి రూ.600 లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు యర్రా శ్రీనివాసరావు, పొన్నం వెంకటేశ్వరరావు, సంగయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బోస్ చేరిక రద్దుపై హర్షం

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలో బీజేపీ నాయకుడు సాయి గణేష్ మృతికి ప్రధాన కారకుల్లో ఒకరైయిన మాజీ పోలీస్ అధికారి బోస్ చేరికను రద్దు చేసుకోవడం శుభపరిణామని బీజేపీ పార్టీ రాష్ట్ర గిరిజన మోర్చా అధికార ప్రతినిధి దొడ్డా అరుణ పేర్కొన్నారు. శనివారం నగరంలోని 7వ డివిజన్ కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏ అధికారి అయినా విధుల్లో ఉన్నప్పుడు అధికార పార్టీకి తొత్తులుగా కాకుండా న్యాయం పక్షాన నిలవాలని, బోస్ చేరిక వెనక ఎవరి హస్తం ఉందో త్వరలోనే బయటకు వస్తుందన్నారు. కార్పొరేటర్ సత్యనారాయణ, ఖమ్మం అర్బన్, టౌన్ అధ్యక్షుడు కుమలి శ్రీనివాసరావులు మాట్లాడుతూ.. కార్యకర్తలకు బాధ కలిగేలా పార్టీలో చేరికలు ఉండొద్దని నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పల్లెపు వెంకన్న, వాకదాని రామకృష్ణ, యరదేశి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫీజ్ రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు మొత్తం తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో డిగ్రీలు పూర్తయినా విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, తద్వారా ఉన్నత చదువుల కోసం వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా.. నేటికీ బకాయిలు చెల్లించలేదని, వెంటనే వాటిని విడుదల చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా నాయకులు వంశీ, పవన్, యశ్వంత్, వికాస్, నరేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి

కామేపల్లి: ముచ్చర్ల మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు శతకోటి వీరనాగులుయాదవ్ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు వీరనాగులు మృతదేహంపై పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

పలువురికి సన్మానాలు..

నర్స్‌కు..

కామేపల్లి: ప్రభుత్వ ఉద్యోగి బాధ్యతతో పని చేస్తే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చందన అన్నారు. శనివారం పీహెచ్‌సీలో(పీహెచ్ఎన్) పబ్లిక్ హెల్త్ నర్స్‌గా పని చేస్తున్న బాలెపు కళావతి పదవి విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం కళావతి చేసిన సేవలను పలువురు వైద్య సిబ్బంది కొనియాడి పూలమాలలు, శాలువాలతో ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్ సుశేశ్వరరావుకు..

ఖమ్మంవైద్యవిభాగం: గత 33 ఏళ్లుగా ఖమ్మం జిల్లా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వ్యాక్సిన్ వెహికల్ డ్రైవర్‌గా పనిచేసిన సుశ్వేశ్వరరావు శనివారం పదవి విరమణ పొందగా.. కార్యాలయంలో సుశేశ్వరావు దంపతులను అధికారులు, తెలంగాణ ప్రభుత్వ ఖమ్మం ఉమ్మడి జిల్లా డ్రైవర్ల సంఘం ఆధ్వర్యాన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ. అబ్దుల్ హకీమ్ మాట్లాడుతూ.. సుశేశ్వరరావు అందించిన సేవలను కొనియాడి.. ప్రభుత్వపరంగా అందాల్సిన బెనిఫిట్స్ త్వరగా అందజేయాలని అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఏఓ మోతియా, డాక్టర్ మోహన్‌రావు, సూపరిటెండెంట్ రాజేందర్, డ్రైవర్ల సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి టి.పంతులు, జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు వై.వీరారెడ్డి, జిల్లా కోశాధికారి యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంకు..

ఖమ్మంఅర్బన్: విద్యార్థుల ప్రగతి, పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తూనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటుపడిన మోత్కూరి మధు సేవలు అభినందనీయమని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మదన్‌మోహన్ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మధు శనివారం ఉద్యోగ విరమణ చేయగా ఆయనను సన్మానించి మాట్లాడారు. గత 38 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన ఆయన పాఠశాలలో వసతుల కల్పనకు కృషి చేశారని, పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటుపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కట్ట శేఖర్‌రావు, ఎల్.సతీష్, విజయ్, అమృతకుమార్, రాయల నర్సింహారావు, సర్వర్‌మియా, సుదర్శన్, రమణారావు, సాంబశివరావు, రమాదేవి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి..

తిరుమలాయపాలెం: మండలంలోని కుక్కలతండా ప్రాథమిక పాఠశాలలో పనిచేసి పదవి విరమణ పొందిన కొప్పుల విజయలక్ష్మి దంపతులను గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులను తీర్చిదిద్దడంలో విజయలక్ష్మి చూపిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తండాకు చెందిన పెద్దలు పాల్గొన్నారు.

నియామకం



సత్యనారాయణ

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీ కుల సంఘాల ఐక్యవేదిక జిల్లా నూతన అధ్యక్షుడిగా రేఖ సత్యనారాయణయాదవ్ నియమితులయ్యారు. అంతేకాక శనివారం జ్వాలా నర్సింహారావు అధ్యక్షతన ఖమ్మంలో జరిగిన సంఘ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా అంకిత పాపారావును కూడా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ యాదవ్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఉన్న బీసీలను చైతన్య పరుస్తూ ,రాజకీయాలలో బీసీల వాట బీసీలకు దక్కేలా కృషిచేస్తానన్నారు. అనంతరం సత్యనారాయణను పలువురు అభినందించారు.

బీజేపీతోనే సామాజిక న్యాయం



మాట్లాడుతున్న వినోద్‌రావు

ఖమ్మం మామిళ్లగూడెం: సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యమని బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. శనివారం నగరంలో విస్తృత పర్యటన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 8వ డివిజన్ బాలపేటలో బీజేపీ రాష్ట్ర నాయకుడు భూక్య కృష్ణరాథోడ్‌తో పాటు స్థానిక గిరిజన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 59వ డివిజన్ దానవాయిగూడెంలో ఓ వివాహ వేడుకలో పాల్గొనడంతో పాటు శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థాన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే, 4వ డివిజన్ శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీమద్దిరావమ్మ , శ్రీముత్యాలమ్మ అమ్మవార్ల విగ్రహ పునఃప్రతిష్ఠాపనలో పాల్గొనడంతో పాటు శ్రీరామగిరి రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీని ఆదరించి తనకు అవకాశం కల్పిస్తే జిల్లా అభివృద్ధికి పాటుపడతానన్నారు. శనివారం రాత్రి పార్టీ కార్యాలయంలో తన గెలుపునకు చేపట్టాల్సిన కార్యచరణపై కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొంగల సత్యనారాయణ, ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరావు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, సరస్వతి, అనంతు ఉపేందర్, ఏపురి నాగేశ్వరావు, గజ్జల శ్రీనివాస్, రమేష్, సుందర్, పార్లమెంట్ ప్రభారి శ్రీకాంత్, గెంటెల విద్యాసాగర్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

కామేపల్లి: త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో సీట్లు గెలవడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సీనియర్ అడ్వకెట్ బోడేపూడి విఠల్‌రావు అన్నారు. శనివారం మండలంలోని కొత్తలింగాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి, అండగా నిలిచిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆదరణ కోల్పోయిందని, ఓటు కోసం వచ్చే బీఆర్ఎస్ నాయకులకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ గెలుపుతో ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కిరణ్ ఆశయాలను సాధిద్దాం

ఖమ్మంమయూరిసెంటర్: ఆటో కార్మికుల సమస్యల కోసం అనేక పోరాటాలు చేసిన తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ దివంగత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ ఆశయాలను సాధించుకునేందుకు ఐక్య పోరాటాలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జి.రామయ్య పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని కాల్వొడ్డులో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యాన నిర్వహించిన కిరణ్ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. అనంతరం కిరణ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎడ్లపల్లి ఉపేందర్, ఐఎఫ్‌టీయూ ఖమ్మం ఏరియా కార్యదర్శి కె.శ్రీనివాసు, నాయకులు కొండయ్య, సుదర్శన్, వెంకటరామిరెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న వడ్డీ రాయితీ గడువు

ఖమ్మంమయూరిసెంటర్: ఇంటి పన్ను వడ్డీపై రాయితీకి నేటితో గడువు ముగియనుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నగర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో బిల్ కలెక్టర్లు అందుబాటులో ఉంటారని, వారి వద్ద పన్నులు చెల్లించి రాయితీ పొందాలని అన్నారు.

'కవిత మెమోరియల్'లో ఎయిడ్స్‌పై అవగాహన

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యాన ఎయిడ్స్ అండ్ హెచ్ఐవీపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ సత్యకుమార్, డీఆర్‌పీ శివయ్యలు మాట్లాడుతూ.. ఎయిడ్స్‌ను కంట్రోల్ చేయడంలో ముఖ్యపాత్ర యువతదేనని, వారు వారి గ్రామాల్లో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఎయిడ్స్ పాజిటివ్ వచ్చినప్పుడు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం యువతకు వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, క్విజ్ కాంపిటీషన్ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైకే అకౌంట్స్ అండ్ ప్రోగ్రాం అధికారి కమర్తపు భానుచందర్, కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ. రమణరావు, ఎన్ఎస్ఎస్ పీఓ లక్ష్మణ్, టి.వంశీప్రియ, జాగృతి యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సయ్యద్ షారుఖ్ ఇమ్రాన్, నెహ్రూ యువ కేంద్ర వలంటీర్లు నాగాచారి, ఉషలు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని కార్మికుల ఆందోళన



వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ వర్కర్లు

నేలకొండపల్లి: గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్ల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీటు జిల్లా నాయకుడు పగిడికత్తుల నాగేశ్వరరావు, యూనియన్ జిల్లా కార్యదర్శి రామదాసులు అన్నారు. వేతనాల కోసం శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి వివిధ డిమాండ్ల కూడిన వినతి పత్రాన్ని మండల పంచాయతీ అధికారికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు, ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుంటే ఎలా బతికేదని, ఆత్మహత్యలు చేసుకుంటేనే చెల్లిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల వేధింపుల కారణంగా కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో ఓ వర్కర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని అన్నారు. ప్రతి నెలా 5వ తేదీలోపే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్ల యూనియన్ నాయకులు షేక్ రహింతుల్లా, వీరబాబు, అనిత, సుధాకర్, నరసింహారావు, బుచ్చిరాములు, నగేష్, పుల్లయ్య, బాబు, జానీ, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/కామేపల్లి: నగరంలోని 33/11 కేవీ రామాలయం సబ్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాసనగర్‌లో ప్రధాన విద్యుత్ లైన్ పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఖమ్మం టైన్–2 ఏడీఈ రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో చింతకాని మండలం నాగులవంచ, పందిళ్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ ఉండదన్నారు. అలాగే కామేపల్లి మండలంలోని పొన్నేకల్ ఫీడర్ పరిధిలో గల బండిపాడు, రాయిగూడెం, రుక్కితండా గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ కోత ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈలు కోరారు.

రేపటి నుంచి ప్రతిష్ఠాపన మహోత్సవాలు

కామేపల్లి: మండలంలోని ఊట్కూర్ గ్రామంలో రేపటి (ఏప్రిల్ 1) నుంచి నాలుగు రోజుల పాటు శ్రీ రామలింగేశ్వరస్వామి ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభమవుతున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు పాశం హనుమంతరావు, యాలాద్రి, ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయంలో వినాయక, ఆంజనేయస్వామి, నందీశ్వరుడు, జంట నాగమయ్య, నవగ్రహం , ధ్వంజస్తంభం ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు..

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రోబోటిక్‌పై శిక్షణ పూర్తి చేసుకున్నారు. శనివారం ఈ మేరకు సువిధ ట్రస్ట్ బాధ్యులు అమరనేని సుదర్శన్‌రావు విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమారి, వేంసాని వెంకటేశ్వరారవు, రోబోటిక్ ఇంజనీర్ సునీల్‌కుమార్, నల్లమల అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

విలువలు తెలుసుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: పిల్లలు ఇస్లామియా విలువలు తెలుసుకోవడానికి రంజాన్ మాసం అద్భుతమైందని జమాతె ఇస్లామి హింద్ ఖిల్లా శాఖ మహిళా అధ్యక్షురాలు అస్సియా అంజుమ్ అన్నారు. ఖమ్మంలో శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్న పిల్లల్లో ఇస్లాంను ప్రేమించేలా ఇలాంటి ఇఫ్తార్ కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఫాతిమా, ఫర్జానా, సీమా, ఫైజా తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాదారం గ్రామంలో జరిగిన జాతర సందర్భంగా ఇరువర్గాల నడుమ ఘర్షణ చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామంలో రెండు రోజులుగా అంకమ్మ జాతర జరుగుతోంది. ఈక్రమంలో ప్రభ వాహనాల ఊరేగింపు వద్ద వివాదం మొదలుకాగా.. శనివారం అది మరింత ముదిరింది. దీంతో రెండు వర్గాలుగా విడిపోయిన పలువురు ఘర్షణకు దిగడంతో అరుపులు, కేకలతో ఉద్రిక్తత నెలకొంది. ఈమేరకు ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను అక్కడ నుంచి పంపించారు. అయితే, ఎవరు కూడా ఘర్షణకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

హక్కుదారులను వేధించడం సరికాదు..



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్ / రఘునాథపాలెం / ఖమ్మం సహకారనగర్: ఖమ్మం అర్బన్ మండలం ఖానాపురం రెవెన్యూ పరిధి స్వాతంత్ర్యసమరయోధులకు, ఆర్మీ మాజీ సైనికులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో హక్కుదారులను రెవెన్యూ అధికారులు వేధిస్తూ నిర్మాణాలను కూల్చివేయడం సరికాదని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురితో కలిసి శనివారం ఆయన ఆర్డీఓ గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ ఏళ్ల క్రితం వైఎస్సార్ నగర్ సమీపాన సర్వే నంబర్ 37లో 400 మందికి పైగా సైనికులకు, స్వాతంత్ర్య సమరయోధులకు ఇళ్ల స్థలాలు ఇవ్వగా.. సౌకర్యాలు లేక ఇళ్లు నిర్మించుకోలేదని తెలిపారు. కానీ ఇప్పుడు కబ్జాలు, ఆక్రమణల పేరిట పేదల ఇళ్లను కూల్చివేయడం సరికాదన్నారు. అలాగే, రఘునాథపాలెం మండలం పువ్వాడ ఉదయ్ కుమార్ కాలనీలో మధ్యతరగతి ప్రజలు ఇల్లు కూలగొట్టడం దారుణమని ఐఎఫ్‌టీయూ నాయకుడు పేరబోయిన వెంకన్న పేర్కొన్నారు. శనివారం ఆయన పలువురితో కలిసి నిర్మాణాలను పరిశీలించి మాట్లాడారు. ఇక ఇదే విషయమై సీపీఎం నాయకులు శ్రీకాంత్, నవీన్ రెడ్డి తదితరులు ఆర్డీఓ గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో స్వాతంత్ర్య సమరయోధులు, వారి వారసులు, నాయకులు లలితమ్మ, సత్యం, దమయంతి, రవి, పుల్లారావు, కమ్మ కోమటి నాగేశ్వరరావు, జాన్‌బీ, రమ, రమేష్, షేక్ సైదులు, నాగుల్‌మీరా, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, కూచిపూడి నరేష్, రాంబాబు, ఉపేందర్, రాజు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.